




మదనపల్లె బైపాస్‌రోడ్డు

అంతా మాయ..



- రికార్డులు తారుమారు.. పేజీలు మాయం
- బి.కె.పల్లె సర్వే నెంబరు 552లో గందరగోళం
- బైపాస్ రోడ్డు రాకతో మారిన స్వరూపం
- విభజనలో బీఎస్‌వో 34డీ నిబంధనలకు తూట్లు
- స్కెచ్‌లే కాదు..అసైనీల్లో మార్పు, చేర్పులు
- 17 నుంచి 12, ఆపై 10కి చేరిన పట్టాదారులు
- కలెక్టర్ జారీ చేసిన ఎన్‌వోసీపైనా నీలినీడలు



వివాదాలకు నిలయమైన స్థలం

మదనపల్లె, జనవరి 1: మదనపల్లె శివారు ప్రాంతాల్లోని విలువైన భూముల్లో అత్యంత ఖరీదైన రెవెన్యూ గ్రామం బి.కె.పల్లె. అందులోని సర్వే నెంబరు-552-1, 2లోని 20.40 ఎకరాల చుట్టే ప్రస్తుతం రెవెన్యూ వ్యవహారం నడుస్తోంది. ఆ సర్వే నెంబరులో అంతా మాయగా ఉంది. రెవెన్యూ రికార్డులు మాయం కావడం, రికార్డులో పేజీలో చించేయడం, కొత్తగా చేర్చడం అంతా గందరగోళంగా ఉంది. బైపాస్ రోడ్డుకు అటు, ఇటు విస్తరించిన ఈ భూముల్లో ఇటీవల మాజీ సైనికుడి పేరుతో ఉన్న భూమిని ఓ మంత్రి కుటుంబం ఈ ఏడాది ఏప్రిల్‌లో కొనుగోలు చేయడం, తర్వాత సబ్ డివిజన్లు మారిపోయాయనే ప్రచారం, ఆపై ఇదే భూమికి అప్పటి తహసీల్దార్ సి.కె.శ్రీనివాసులు 22ఏ రద్దుకు రెకమెండ్ చేయడం ఆ వెంటనే కలెక్టర్ ఈ ఏడాది మే 3వ తేదీ ఎన్‌వోసీ జారీ చేయడం చకచకా జరిగిపోయాయి. ఇప్పటి వరకూ ఎంతోమంది తహసీల్దార్లు పనిచేసినా ఈ సర్వే నెంబరులో తారుమారైన, మాయమైన రెవెన్యూ రికార్డుల గురించి నోరువిప్పలేదు. కొత్తగా వచ్చిన ప్రతి అధికారీ చాంతాడంత రిపోర్టు, నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపిన ఫైళ్లు కుప్పలుగా ఉన్నాయి. గతంలో ఇక్కడ పనిచేసిన సిబ్బంది నుంచి తహసీల్దార్‌ల వరకూ రికార్డులను తారుమారు చేస్తే, ఇంకొకరు వాటిని చింపేయడం, వాటి స్థానంలో మరొకరి పేరుతో పాటు మరో రికార్డు సృష్టించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో నిజమైన అసైనీలు ఎవరో అర్థం కాక రెవెన్యూ అధికారులు తలపట్టుకుంటున్నారు. ముఖ్యంగా 2003లో జరిగినట్లు చెబుతున్న బైపాస్ సబ్ డివిజన్ స్కెచ్ తయారీ అంశంలో అప్పటి అధికారులు చేసిన పొరపాటో లేక తప్పిదమో లేక అయినవారికి లబ్ధి చేకూరేలా వ్యవహరించారో తెలీదు కానీ..అసలు వివాదానికి కారణం ఇక్కడి నుంచే మొదలైందని ఆ శాఖ అధికారులే వాపోతున్నారు.

బి.కె.పల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు-552లో మొత్తం విస్తీర్ణం 20.40 ఎకరాలు. బ్లాకు నెంబరు 440 పూరా విస్తీర్ణం 486.64 ఎకరాల నుంచి 552ను విడగొట్టారు. తర్వాత సర్వే నెంబర్-552, 7ఆర్-40-68, సబ్‌కలెక్టర్ డిస్ నెంబర్-10848-58 ప్రకారం సర్వే నెంబరు-552-1లో 16.64 ఎకరాలు, సర్వే నెంబరు-552-2లో 3.76 ఎకరాలు మొత్తం కలిపి 20.40 ఎకరాల విస్తీర్ణంగా సబ్ డివిజన్ చేశారు. అనంతరం సర్వే నెంబర్-552-1 విస్తీర్ణం 16.64 ఎకరాలను 17 సబ్ డివిజన్లు చేశారు. అలాగే 2001లోని మాన్యువల్ అడంగల్‌లో 552-1లో 3.50 ఎకరాలు, 552-2లో 3.76 ఎకరాలు, 552-3లో 2.75 ఎకరాలు ఉన్నట్లు నమోదు చేశారు. ఆయా సబ్ డివిజన్ల మేరకు ఫీల్డ్‌మెజర్ మెంట్ బుక్ (ఎఫ్‌ఎంబీ)లోనూ 17 సబ్ డివిజన్లు చేశారు. ఇదిలా వుండగా, సర్వే నెంబర్-552లో బైపాస్ రోడ్డు కోసం భూసేకరణ చేసినప్పుడు బీఎస్‌వో 34డీ నిబంధన పాటించలేదు. ఆ ప్రకారం సబ్‌డివిజన్ రికార్డు తయారు చేయలేదు. బైపాస్ రోడ్డు నిమిత్తం భూసేకరణ చేసినప్పుడు పాత ఎఫ్‌ఎంబీ స్కెచ్ 8ఏ నెంబర్8ఏ-03-1413, డిసెంబరు ఒకటి 2003 ప్రకారం రద్దు చేసినట్లు పాత ఎఫ్‌ఎంబీ స్కెచ్‌లో చూపించారు. తర్వాత భూసేకరణ ప్రూ్యటీనీ అయిన సబ్ డివిజన్ రికార్డులో బి.కె.పల్లె సర్వే నెంబర్-552లో కింది విధంగా పొందుపరిచారు. 552-1లో 10.05 ఎకరాలు, 552-2లో 0.57 ఎకరాలు, 552-3లో 1.30 ఎకరాలు, 552-4లో 0.49 ఎకరాలు, 552-5లో 0.64 ఎకరాలు, 552-6లో 2.72 ఎకరాలు, 552-7లో 3.40 ఎకరాలు, 552-8లో 0.50 ఎకరాలు, 552-9లో 0.08 ఎకరాలు, 552-10లో 0.65 ఎకరాలు చూపించారు. ఇలా 552-1, 552-2లోని మొత్తం విస్తీర్ణం 20.40 ఎకరాలుగా విభజించారు.

గతంలో 17 సబ్ డివిజన్లు ఉండగా, బైపాస్ రోడ్డు అనంతరం 10 సబ్ డివిజన్లకు కుదించారు. తర్వాత తయారైన ఎఫ్‌ఎంబీలో ఎనిమిది మంది పట్టాదారులనే చూపించారు. అలాగే 2014 అనెగ్జర్-1 ప్రకారం 12 మందిని డీకేటీ పట్టాదారులుగా చూపించారు. అంటే మొదట్లో ఉన్న 17నా? లేక తర్వాత వచ్చిన 10నా? లేక 12నా? ఏది కరెక్ట్ అన్నది చెప్పలేకపోతున్నారు. ఒక నెంబరు సబ్ డివిజన్ చేసినప్పుడు ఆ సబ్ డివిజన్‌లోని చివరి అంకె తర్వాత వచ్చే నెంబర్‌ను కొత్త సబ్ డివిజన్‌కు కేటాయించాలి. వీటిని పరిగణలోకి తీసుకోకుండా ఇష్టానుసారం చేసేశారు. అయిన వారి కోసమో లేక తమ బినామీలకు భూమిని కట్టబెట్టే క్రమంలో రకరకాలుగా స్కెచ్‌లు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఒకవేళ ముందు వాటిని రద్దు చేస్తే ఎందుకు రద్దు చేస్తున్నారో చూపించాలి. ఈ క్రమంలో గతంలో డీకేటీ, అసైన్డ్ పట్టాలు ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేస్తున్నట్లు, చేసినట్లు ఆయా రైతుకు నోటీసులిచ్చి రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంది. కానీ ఇదెక్కడా జరగలేదు. కొందరికి డీకేటీ, మరికొందరికి అసైన్డ్ పట్టాలు ఇచ్చినట్లు ఆయా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారు. కానీ వీటిని పరిగణలోకి తీసుకోకుండా బైపాస్ రోడ్డు భూసేకరణ తర్వాత అమలులోకి వచ్చిన రికార్డుల్లో చూపించారు. అదే ప్రస్తుతం భూ వివాదాలు, కోర్టు కేసులకు కారణమవుతోంది. ఇదిలా ఉండగా, గతంలో ఇక్కడ పనిచేసిన కొందరు తహసీల్దార్లు ఆయా రైతులను హక్కుదారులుగా ధ్రువీకరిస్తూ నోటీసులు జారీ చేశారు. మరోవైపు పట్టణ శివారులోని ఇదే సర్వే నెంబర్‌లో పేదలకు కేటాయించిన అర్బన్ హౌసింగ్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం వాటిని తిరిగి స్వాధీనం చేసుకుంటున్నట్లు కొందరు రైతులకు నోటీసులు జారీ చేశారు. తర్వాత ఈ కాలనీలకు వెళ్లడానికి కావాల్సిన రోడ్డు నిర్మాణానికి డీకేటీ, అసైన్డ్ భూమిని తీసుకుంటున్నట్లు అధికారికంగా నోటీసులు ఇచ్చారు. ఇదిలా ఉండగా, గతంలో ఉన్న 17 సబ్‌డివిజన్లలో కొత్తగా పట్టాదారులు కూడా చేరారు. ఇందులో మాజీ సైనికుడి పేరుతో కూడా రికార్డులు సృష్టించారు. ఇందులో అసలైన పేర్లను రికార్డుల్లో తీసేసి, వాటి స్థానంలో నకిలీ రికార్డులతో సంబంధం లేని వ్యక్తులను చేర్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ రిజిస్టర్, ఫోర్ ఏ రిజిస్టర్‌లోనే కాదు..రెవెన్యూశాఖలో అత్యంత కీలకమైన రికార్డుల గదిలోని ఫైళ్ల స్థానంలో నకిలీ ఫైళ్లను కూడా చేర్చారంటే ఏ స్థాయిలో రికార్డులు తారుమారు చేశారో చెప్పేయచ్చు. తర్వాత అదే రికార్డును సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేయడం అదే రికార్డును అధికారికంగా తీసుకోవడం, సర్వహక్కులూ తమకే ఉన్నాయంటూ చెప్పుకోవడమే కాదు..కోర్టులకు వెళ్లడం మామూలైపోయింది. వివాదాలు, కోర్టు కేసులు మెడకు చుట్టుకునే క్రమంలో తహసీల్దార్లు అప్పుడున్న రికార్డును బట్టి కోర్టుకు, ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నారు.



రికార్డుల మార్పుతో వివాదాస్పదంగా మారిన భూమి

బి.కె.పల్లె సర్వే నెంబరు-552పై తహసీల్దార్లు ఇచ్చిన రిపోర్టులు చాలానే ఉన్నాయి. వాస్తవాలను క్రోడీకరిస్తూ ఒక్కొక్కరు ఓ విధంగా కూడా నివేదిక ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు తీసుకుంటే అదే సర్వే నెంబరులో తట్టి శ్యామలమ్మ, మాజీ సైనికుడిగా చెబుతున్న వై.దేవేంద్రరెడ్డిలు ఆ భూమి తమదంటే తమదంటూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై నివేదిక ఇచ్చే క్రమంలో తహసీల్దారే కాదు జిల్లా ఉన్నతాధికారే తల పట్టుకుంటున్నారు. మాజీ సైనికుడిగా చెప్పుకుంటున్న దేవేంద్రరెడ్డిది నకిలీ పట్టా అని గతంలో జిల్లా స్థాయిలో పనిచేసిన అధికారే ధ్రువీకరిస్తూ, మానవహక్కుల సంఘానికి నివేదించడంతో పాటు దీనిపై చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జేసీ స్థాయిలో ఆయన ఆదేశాలు ఇప్పటికీ అమలు కాకపోగా, అదే కేసును ప్రస్తుతం స్వయంగా ఆయనే విచారిస్తున్నారు. ఇదిలా డండగా, గతంలో ఉన్న 17 సబ్ డివిజన్లలో పది అయిన వాటిలో మాజీ సైనికుడి పేరు ఉండటం అటు రెవెన్యూ, ఇటు స్థానిక రైతులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. కాలువలు, వంకలు, వాగులకు గతంలో రికార్డుల్లో ఇచ్చిన సబ్ డివిజన్లను మార్చే అధికారం ఎవరికీ లేదు. ప్రస్తుతం అవి క్షేత్రస్థాయిలో ఉన్నప్పటికీ రికార్డుల పరంగా మార్చేశారు రెవెన్యూ, సర్వే అధికారులు. నకిలీ సబ్ డివిజన్లు సృష్టించి అనర్హులకు బైపాస్ రోడ్డు పరిహారం దక్కేలా చేసినట్లు ఆరోపణలున్నాయి.



మంత్రి కుటుంబం కొనుగోలు చేసిన భూమి

ఆ నెంబరు అంతా కన్ఫ్యూజనే..

బి.కె.పల్లె సర్వే నెంబరు-552 అంతా కన్ఫ్యూజనే. నాకు కూడా పూర్తి క్లారిటీ లేదు. ముందున్న తహసీల్దార్లు ఇచ్చిన పాత రిపోర్టులే నేనూ ఇస్తున్నా. ఆ నెంబరులో మొదట 17 సబ్ డివిజన్లు ఉండగా, 2003 బైపాస్ రోడ్డు సబ్ డివిజన్‌లో ఒకటి నుంచి 17 నెంబర్లను పదిగా మార్పు చేసినట్లు ఏ రిజిస్టర్‌లో ఎంట్రీ ఉంది. అయితే 17 నుంచి 10 కావడానికి, 2014, అనెగ్జర్-1 ప్రకారం 12 అవడానికి కారణాలు నాకు కూడా తెలియడం లేదు. మిగిలిన ఏడు సబ్ డివిజన్లను రద్దు చేశారా? లేక పొరపాటు చేశారో నాకు క్లారిటీ రాలేదు. సబ్ డివిజన్ రూల్ ప్రకారం చేయాలి. కానీ సర్వేయర్ ఇచ్చిన రిపోర్టు చూస్తే ఆ నిబంధన ప్రకారం జరగలేదని చెబుతోంది. సర్వేయర్ రిపోర్టుతో పాటు రికార్డుల్లోని మార్పులు, చేర్పులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అలాగే సర్వే నెంబర్-552-3, 10, 15 నెంబర్లలో కోర్టు కేసులు నడుస్తున్నాయి. వీటిని కలెక్టర్ చూస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మా దగ్గరున్న రికార్డులు, రిపోర్టులు ఇచ్చాం. ఈ నెంబర్‌లో 22ఏ రద్దుకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆ నెంబర్‌లో ఉన్న పరిస్థితిని బట్టి మేం ఏమీ చేయలేమని చెప్పేస్తున్నాం. ఇక్కడి సర్వే నెంబర్‌లో కలెక్టర్ ఎన్‌వోసీ ఇచ్చారు. ఆ నెంబర్లను మరోసారి పరిశీలిస్తా.

- షేక్ మహబూబ్‌చాంద్, తహసీల్దార్, మదనపల్లె

రాజంపేటలో అన్న క్యాంటీన్ ప్రారంభం

- ప్రారంభించిన గంటా నరహరి
- 5 వేల మందికి పైగా అన్నదానం



రాజంపేటలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నేత గంటా నరహరి



అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న గంటా నరహరి, చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జనవరి 1 : రాజంపేట పట్టణంలో తెలుగు దేశం పార్టీ నాయకుడు గంటా నరహరి ఆధ్వర్యంలో సోమవారం అన్న క్యాంటీన్‌ను అట్టహాసంగా వేదపండితుల ఆశీర్వచనాల మధ్య ప్రారంభించారు. అనంతరం టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుతో కలిసి గంటా నరహరి తదితర నాయకులు పేదలకు చికెన్ దమ్ బిర్యానీ, స్వీట్లు వడ్డించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, పేదలు పాల్గొన్నారు. భారీ జనసమూహంతో ర్యాలీగా బాణాసంచా పేలుస్తూ, డప్పులు వాయిస్తూ, నినాదాలు చేస్తూ కార్యకర్తలు భారీ కాన్వాయిగా ర్యాలీగా రావడంతో రాజంపేట పట్టణం ఆర్‌ఎస్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. సుమారు 5 వేల మంది ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్లు టీడీపీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, రాజంపేట మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, తెలుగు మహిళ జిల్లా మాజీ అధ్యక్షురాలు కుసుమకుమారి, ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు కొల్లు రెడ్డయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, పట్టణ మాజీ అధ్యక్షుడు తరిగోపుల సంజీవరావు, టీడీపీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, సిద్దవటం నాయకులు నాగమునిరెడ్డి, సిద్దవటం నాయకులు వెంకటసుబ్బయ్య, ఒంటిమిట్ట టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, సుండుపల్లె మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, రైతు నాయకులు జ్యోతి సుబ్బారెడ్డి, మైనారిటీ నాయకులు షేక్ మహమ్మద్ అలీ, ఇషాక్, మాజీ కౌన్సిలర్ మనుబోలు చిన్నయ్య, గుగ్గిళ్ల చంద్రమౌళి, యువనాయకులు పిడికిటి సంతోష్, తాళ్లపాక సీనియర్ నాయకుడు అంజన్‌రాజు, టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు పోలి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుష్టపాలన కూలి.. ధర్మపాలన రానుంది

ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, అన్న క్యాంటీన్ నిర్వాహకులు గంటా నరహరి మాట్లాడుతూ జగన్ దుష్టపాలన త్వరలో కూలనుందని.. ధర్మపాలన రానుందని తెలిపారు. పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న ఉద్దేశ్యంతో టీడీపీ అధికారంలో ఉండగా అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తే వాటిని మూసివేసి పేదల కడుపు కొట్టిన జగన్ ప్రభుత్వానికి త్వరలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. పేద ప్రజల ఆకాంక్షల మేరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆశీస్సులతో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు.

శుభాకాంక్షల వెల్లువ

- జగన్‌మోహన్‌రాజు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



జగన్‌మోహన్‌రాజుకు పూలమాలలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

రాజంపేట, జనవరి 1: రాజంపేట పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి ఆయనను పూలమాలలతో సత్కరించి కేకులు తినిపించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ మహిళాధ్యక్షురాలు పత్తిపాటి కుసుమకుమారి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మాజీ కౌన్సిలర్లు గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుబోలు వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, జిల్లా వాణిజ్య విభాగం లక్ష్మీనారాయణ, బీసీ నాయకులు ఇడిమడకల కుమార్, మాజీ పట్టణ అధ్యక్షుడు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

కొండంత జనం...



గాలిబండ ప్రాంతంలో ఉల్లాసంగా...

- హార్సిలీహిల్స్‌కు వేలాదిగా తరలివచ్చిన పర్యాటకులు
- పోలీసుల పటిష్ట బందోబస్తు
- న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతం

బి.కొత్తకోట, జనవరి 1 : ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ కిటకిటలాడింది. నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకునేందుకు సోమవారం పర్యాటకులు వేలాదిగా తరలివచ్చారు. డిసెంబరు 31న గెస్ట్‌హౌస్‌లు బుక్ చేసుకున్న పర్యాటకులు ఆయా గెస్ట్‌హౌస్‌ల ఎదుట బహిరంగ ప్రదేశాల్లో చల్లటి వాతావరణంలో క్యాంప్ ఫైర్ వేసి నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. సోమవారం ఉదయం జనవరి 1న వేలాది మంది కుటుంబీకులు, స్నేహితుల బృందాలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హార్సిలీ హిల్స్‌కు తరలివచ్చారు. హిల్స్‌పై నున్న ఆహ్లాదకర వాతావరణం మనస్సుకు హత్తుకునే సుందరమైన దృశ్యాలను చూస్తూ సేద తీరారు. మానస సరోవరంలో బోటింగ్ చేశారు. గాలిబండ, వ్యూపాయింట్‌ల ద్వారా 4500 అడుగులు కింది భాగంలో ఉన్న చుట్టు పక్కల ప్రాంతాలను వీక్షిస్తూ ఫొటోలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. హిల్స్‌పై ఉన్న ఏనుగు మల్లమ్మ ఆలయంతో పాటు ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన శ్రీవారి పాదాలకు పూజలు చేశారు. పర్యాటకుల రద్దీని ముందుగానే ఊహించిన అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. మదనపల్లె డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడిపి, రద్దీకి తగ్గ రవాణా సౌకర్యం కల్పించారు. హిల్స్‌పై రెస్టారెంట్లు కిటకిటలాడాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలను పైకి అనుమతించకపోవడవతో ఘాట్ రోడ్డులో యువకులు, ఆకతాయిల అల్లర్లకు అవకాశం లేకుండాపోయింది. బహిరంగ మద్యపానాన్ని ఏమాత్రం అనుమతించకపోవడంతో కుటుంబంతో వచ్చిన పర్యాటకులు ప్రశాంతంగా పర్యటన ముగించుకుని వెళ్లారు. డీఎస్పీ కేశప్ప, బి.కొత్తకోట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్‌ల పర్యవేక్షణలో సుమారు 50 మంది పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా న్యూ ఇయర్ వేడుకలు హార్సిలీ హిల్స్‌లో ప్రశాంతంగా ముగిశాయి.



హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రద్దీ



మానస సరోవరంలో బోటింగ్

విద్యార్థికి ఆధునిక కృత్రిమ చేతులు

- కలెక్టర్ పీఎస్ గిరీషా



కృత్రిమ చేతిని అమర్చిన తర్వాత రాయడం నేర్చుకుంటున్న బాలుడు

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 1: విద్యుదాఘాతంతో జరిగిన ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన విద్యార్థికి కలెక్టర్ చొరవతో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కృత్రిమ చేతులను విద్యార్థికి అందచేసింది. వివరాలిలా ఉన్నాయి. సుండుపల్లె మండలం జీకే రాచపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సులేమాన్ 2022 మే నెలలో విద్యుదాఘాతానికి గురై రెండు చేతులు పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటనతో సులేమాన్, అతడి తల్లిదండ్రులు పూర్తిగా కుంగిపోయి భవిష్యత్తు అంధకారం అవుతుందని దిగులు పడ్డారు. ఈ క్రమంలో 2023 ఆగస్టులో కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో సులేమాన్, అతడి తల్లి కలెక్టర్ పీఎస్ గిరీషాను కలిసి పరిస్థితిని వివరించి తనకు ఉపయోగపడే పరికరాలు ప్రభుత్వం ద్వారా ఇవ్వాలని అర్జీ ఇచ్చారు. సులేమాన్ పరిస్థితి చూసి చలించి పోయిన కలెక్టర్ ప్రభుత్వం ద్వారా అతడిని ఆదుకోవడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖను ఆదేశించారు. ఈ మేరకు 2023 సెప్టెంబరు 11న రూ.65 వేల విలువ చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పనిచేసే స్మార్ట్‌ఫోన్‌ను సులేమాన్‌కు అందచేశారు. అదేరోజు విద్యార్థికి దైనందిన జీవితంలో సహాయపడే ఆధునికమైన బయోనిక్ ఆమ్స్ (కృత్రిమ చేతులు)ను త్వరితగతిన ఇప్పించాలని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీని ఆదేశిస్తూ అందుకు కావాల్సిన నిధులు రూ.2.50 లక్షలను మంజూరు చేశారు. సోమవారం బాలుడికి కృత్రిమ చేతులను కలెక్టర్ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా కృత్రిమ చేతులతో నోట్‌బుక్‌లో హ్యాపీ న్యూ ఇయర్ 2024- థాంక్యూ సార్ అని విద్యార్థి సులేమాన్ రాసి కలెక్టర్‌కు తన కృతజ్ఞతలు తెలియచేశాడు. ఆధునిక కృత్రిమ చేతులు అమర్చిన ఫలితంగా ప్రస్తుతం సులేమాన్‌కు తినడం, రాయడం వంటి దైనందిన కార్యక్రమాలు సొంతంగా చేసుకునే సదుపాయం ఏర్పడింది. కలెక్టర్ చూపిన చొరవ, ఔదార్యానికి బాలుడి తల్లిదండ్రులు కలెక్టర్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటామని కన్నీటితో తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీ కృష్ణకిశోర్, రీహాబిలిటేషన్ అధికారి శ్రీకాంత్, విద్యార్థి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ... ఒకరు మృతి


మృతి చెందిన గంగాధర్‌రెడ్డి

ఎర్రగుంట్ల, జనవరి 1: మండలంలోని వై.కోడూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం అర్ధరాత్రి రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో వై.కోడూరుకు చెందిన రామిరెడ్డి గంగాధర్‌రెడ్డి (35) మృతి చెందాడు. ఆదివారం అర్ధరాత్రి రామిరెడ్డి గంగాధర్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డిలు పెద్దనపాడు గ్రామం నుంచి వై.కోడూరుకు వస్తున్నారు. అదే సమయంలో ఎర్రగుంట్ల నుంచి వీరాంజినేయరెడ్డి బైకులో వై.కోడూరుకు వస్తున్నారు. రెండు బైకులు వై.కోడూరు క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గంగాధర్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆసుపత్రికి తరలించగా గంగాధర్‌రెడ్డి చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. అర్బన్ సీఐ ఈశ్వరయ్య కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

నిబంధనలకు పాతర

- ఆర్టీసీ టెండర్ల జీఎస్టీ బిల్లులు చెల్లింపుల ఎగవేత
- అన్నీ సవ్యంగా ఉన్నా.. దాటవేత ధోరణి
- కుంటి సాకులు చెబుతున్న సంబంధిత ఏవో
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

కడప (మారుతీనగర్), జనవరి 1: అది ఘనత వహించిన ఏపీఎస్ ఆర్టీసీ. నిత్యం రాత్రి పగలు తేడా లేకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేవేసే సంస్థగా ప్రజల విశ్వాసాన్ని చూరగొంది. కాగా ఆర్టీసీకి చెందిన బస్టాండ్లు, గ్యారేజీలు, ఆర్ఎం ఆఫీసు, డీఎంఆఫీసు, ఈడీ ఆఫీసు, అద్దె బస్సులు, రిజర్వేషన్ కౌంటరు, గ్యారేజీ బస్సుల క్లీనింగ్ తదితర విభాగాల్లో టెండర్ల ద్వారా అవుట్ సోర్సింగ్ కార్మికులను నియమించుకునేందుకు వీలుగా టెండర్లు వేయడం పరిపాటి. అందుకు వీలుగా ఏ క్లాస్, బిక్లాస్, త్రీ క్లాస్ కేటగిరిలుగా టెండర్లకు కాంట్రాక్టర్లను ఆహ్వానిస్తుంటారు. ఆర్టీసీలో గత కొన్ని సంవత్సరాలుగా వివిధ టెండర్ల ద్వారా 18 శాతం జీఎస్టీ (గూడ్సు అండ్ సర్వీసు ట్యాక్స్) విధిగా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. కాగా ఆ ఇన్‌పుట్ జీఎస్టీని టెండరుదారులకు జీఎస్టీ ఉన్నప్పటికీ వారికి ఇవ్వడం లేదని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కడప రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోలలో ఒకసారి ఆర్టీసీకి చెందిన ఔట్ సోర్సింగ్ కార్మికులకు టెండర్లు జరిగితే కనీసం 700 నుంచి 800 దరఖాస్తులు వస్తుంటాయి. వాటిపై వసూలు చేసే 18 శాతం జీఎస్టీని టెండరుదారులకు జీఎస్టీ తాలుకా రిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ వారికి ఇవ్వకుండా ఆర్టీసీకే జమ చేస్తున్నట్లు సమాచారం. ఈ తంతు 2017 నుంచి నడుస్తున్నట్లు పలువురు టెండరుదారులు గగ్గోలు పెడుతున్నారు. ఉదాహరణకు ఏ క్లాస్ కింద కడప డిపో, బి క్లాస్ కింద పులివెందుల, మైదుకూరు, బద్వేలు డిపోలు, సిక్లాస్ కింద ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోలు వర్తింపజేస్తున్నారు. ఆ మేరకు ఏ క్లాస్ (అవుట్‌సోర్సింగ్, స్టాల్స్) ద్వారా ఒక్కో దరకాస్తుకు రూ.1500తో పాటు అదనంగా జీఎస్టీ కింద 18 శాతం అంటే రూ..270 మొత్తంగా రూ.1770 వసూలు చేస్తున్నారు. అలాగే బి క్లాస్ (ఇన్‌కం సోర్సింగ్ యూనిట్స్) కింద ఒక్కో దరఖాస్తుకు రూ.750 18శాతం జీఎస్టీ కింద అదనంగా రూ.135 మొత్తం రూ.885, సిక్లాస్ కింద దరఖాస్తుకు రూ.250, జీఎస్టీతో కలిపి మరో 45 మొత్తం రూ.295 సంస్థకు చేరుతుంది. అలా ఒక్కో టెండరు నోటిఫికేషన్‌కు సుమారు వెయ్యికి పైగా దరఖాస్తులు అందుతున్నట్లు సమాచారం. ఆ లెక్కన సుమారు రూ.5లక్షల నుంచి 6 లక్షల వరకు జీఎస్టీ కింద ఆర్టీసీ దండుకున్నట్లు తెలుస్తోంది.

కాంట్రాక్టరు బిల్లుతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ చెల్లించినా దానికి సంబంధించిన జీఎస్టీ ఆర్-1, జీఎస్టీ ఆర్-3బి చెల్లించి జత పరిచినప్పటికీ ఆన్‌లైన్‌లో కనిపించడంలేదన్న సాకుతో కడప రీజియన్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఏవోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయం కాంట్రాక్టర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలుసార్లు సంబంధిత పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి మొరపెట్టుకున్నట్లు తెలిసింది. అయినప్పటికీ ఆ ఏవో పైస్థాయి అధికారుల ముందు జీ హుజూర్ అంటూ తరువాత జాన్తానై.. అంటూ జీఎస్టీ తాలుకా జీవో అమలు చేసే విషయంలో ఆర్టీసీ నిబంధనకు పాతర వేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఏదేని బిల్లులో తప్పు ఒప్పులు ఉన్నా.. అందుకు సంంధించి పెనాల్టీ వేసే అధికారం సంబంధిత యూనిట్ అధికారికి ఉంటుందని తెలిసింది. ఆడిట్ చేసే సమయంలో పెనాల్టీ వేసే అధికారం ఏ ఏవోకు లేకపోయినా ఆయా బిల్లులపై పెనాల్టీ వేసి కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమా చారం. పలుమార్లు ఈ విషయంపై ఏవోను కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తే... సిబ్బంది కొరత ఉంది, పైస్థాయి అధికారుల వద్దకు వెళ్లి ఒకరిద్దరిని సిబ్బందిని నియమించేలా చూడాలంటూ హేళనగా మాట్లాడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కడప రీజనల్ మేనేజరును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఆర్టీసీ టెండర్ల వ్యవహారంలో జీఎస్టీని ఎప్పటికప్పుడు టెండరుదారులకు అందజేయడం జరుగుతుంది. అయినప్పటికీ ఏమో ఒకసారి మా ఏవో (అకౌంట్స్ క్లర్కు)ను అడిగి చెబుతానని సమాధానమిచ్చారు.

వివాహిత ఆత్మహత్య

ఎర్రగుంట్ల, జనవరి 1: చిలమకూరుకు ఎం.మానస(22) అనే వివాహిత సోమవరం తెల్లవారుజామున ఇంటిలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల మేరకు... మానస భర్త నాగేష్ కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల మానసకు కడుపునొప్పి అధికమైందని, నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి


మృతి చెందిన దస్తగిరి

సికెదిన్నె, జనవరి 1: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో దస్తగిరి (61) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. కడప నుంచి పెండ్లిమర్రికి వెళుతున్న ఆటో కొప్పర్తి సమీపంలోని రేడి యో స్టేషన్ వద్ద కుక్కలు అడ్డు రావడంతో అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న దస్తగిరి అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ గాయపడటంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా అభివృద్ధికి కలసికట్టుగా పనిచేద్దాం : కలెక్టర్


కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సమాచారశాఖ అధికారులు

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 1: నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దామని కలెక్టర్ పీఎస్ గిరీషా అధికారులకు పిలుపునిచ్చారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పీఎస్ గిరీషా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎస్పీ, డీఆర్‌వో సత్యనారాయణలను వారి చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు, అనధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు, పండ్లను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా జేసీతో కలిసి కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేకును కలెక్టర్ కట్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి సమిష్టిగా నూతనోత్తేజంతో పనిచేద్దామని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు

కలెక్టర్‌ను వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ కృష్ణారావు, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, డీఆర్‌వో సత్యనారాయణ, ఆర్డీవోలు మురళి, రంగస్వామి, రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో బాలకృష్ణ, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖాధికారి భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌వో పురుషోత్తం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, గృహ నిర్మాణశాఖ పీడీ శివయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తహసీల్దార్లు, పాత్రికేయులు కలెక్టర్, జేసీ, డీఆర్‌వోలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, పూలమొక్కలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

చంద్రబాబును సీఎంగా చూడాలన్నదే లక్ష్యం


పోరుమామిళ్లలో నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ యువనేత చెరుకూరి రవికుమార్

పోరుమామిళ్ల, జనవరి 1 : నారా చంద్రబాబునాయుడును సీఎంగా చూడాలన్నదే లక్ష్యమని.. అదే తమ ఆశయమని టీడీపీ యువ నాయకులు కమ్మవారిపల్లెకు చెందిన చెరకూరి రవికుమార్ అన్నారు. పోరుమామిళ్లలో సోమవారం నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ఆత్మీ యులకు స్నేహితులకు సన్నిహితులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి జరగబోయే శాసనసభ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని.. చంద్రబాబు సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పురం బాలకిృష్ణ, చెన్ను వెంకటరమణ, జీవీ సుబ్బయ్య, ముద్దం నాగేంద్ర, రఫి తదితరులు పాలొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇలియాస్‌బాషా, సంగమేశ్వర్‌రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 1: ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎస్ఎం డీ ఇలియాస్‌బాషా, నర్రెడ్డి సంగమేశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కడప నగరం టీటీడీ కల్యాణ మండపంలో 77వ ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమవేశంలో నూతన కార్యవ ర్గాన్ని ఏకగీ్రవంగా ఎన్నుకున్నా రు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, ఎన్నికల అధికారిగా అనంతపురం జిల్లా అధ్యక్షుడు సూర్యుడు వ్యవహరించారు. జిల్ల ఆర్థిక కార్యదర్శిగా రామ్మోహన్, రాష్ట్ర కౌన్సిలర్లుగా మల్లు రఘునాథరెడ్డి, కె.సురేష్‌బాబు, బాల గంగిరెడ్డి, గురుకుమార్, ఎస్.దాదాపీర్, పి.రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఏవీ సుధాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రషీద్‌ఖాన్‌తో పాటు మరికొంత మందిని ఎన్నుకున్నారు. అలాగే అసోసియేట్ అధ్యక్షులును, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.

కోదండరామాలయానికి పోటెత్తిన భక్తులు


ఒంటిమిట్ట, నందలూరులో క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

ఒంటిమిట్ట, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా ఏకశిలా నగిరి కోదండరామాలయానికి పెద్ద ఎత్తున భక్తు లు పోటెత్తారు. వేకువజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు దర్శనం కోసం అనుమతించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, పిల్లలు కుటుంబ సభ్యులతో వచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో రామాలయంలోని గర్భాలయం నుంచి దక్షిణ ద్వారం బయట వరకు భక్తులతో క్యూలైన్ కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా టీటీడీ పెద్ద ఎత్తున క్యూలైన్ ఏర్పాటు చేసింది. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సౌమ్యనాథస్వామి ఆలయానికి...

నందలూరు, జనవరి 1: ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం భక్తులకు పోటెత్తింది. నూతన ఆంగ్ల నామ సంవత్సరం సందర్భంగా తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్నారు.

కన్నుల పండువగా తిరుమలరాయుడు జాతర


ప్రత్యేక అలంకరణలో తిరుమలరాయుడు

సంబేపల్లె, జనవరి 1: నారాయణరెడ్డి పల్లె గ్రామం తిరుమలరాయగుట్టపై వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి జాతర సోమవారం కన్నుల పండువగా జరిగింది. ప్రతి ఏడాది నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా తిరుమల రాయుడు జాతర అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జానపద కళారూపాలు, చెక్కభజనలు అలరించాయి.

వైవీయూ ఏసీఈగా గంగయ్య నియామకం


నియామక పత్రం అందిస్తున్న చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 1: వైవీ యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికా రిగా ఎంబీఏ శాఖ అసిస్టెంటు ప్రొఫెసరు డాక్టర్ గంగయ్యను నియమించారు. ఆదివా రం వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధా కర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బ య్య నియామక పత్రాన్ని గంగయ్యకు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ పరీక్షల బాధ్యతలను అత్యంత జాగ్ర త్తతో నిర్వహించాలని సూచించారు. ఈ సంద ర్భంగా వైస్ చాన్సలర్ రిజిస్ట్రార్‌లకు గంగయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దూరవిద్య ఉపసంచాలకులు డాక్టర్ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా ప్రొఫెసరు పి.రమాదేవి


రమాదేవికి నియామక పత్రాలు అందిస్తున్న రిజిస్ట్రార్

వైవీయూ తెలుగుశాఖలో ప్రొఫెసరుగా పనిచేస్తున్న పి.రమాదేవిని డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా వైస్‌చాన్సలర్ ఆదేశాల మేరకు నియమించినట్లు రిజిస్ట్రార్ వైపీ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఆదివారం వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ తన కార్యాలయంలో ఆమెకు నియామక పత్రాలను అందించారు.

ఎన్నికల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కడప (మారుతీనగర్), జనవరి 1 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి డిమాండ్ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న బీసీల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం పాత రిమ్స్ వద్ద గల బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమూర్తితో పాటు ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు గోవిందు నాగరాజు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన బీసీలకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు రానున్న ఎన్నికల్లో అన్ని పార్టీలు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కళ్యా సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రం యాదవ్, ఏవీఆర్ వెంకటేశ్వర్లు, సీఆర్ఐ సునీల్, మునిరత్నంగౌడ్, శ్రీనివాసులు, చేలో రవి, సుబ్బరాయుడు, మహిళా నాయకులు నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు రద్దు చేయాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడం విరమించుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో రైతు సంఘం ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కొండావాండ్లపల్లెలో విద్యుత్ స్తంభాలకు బిగించిన మీటర్లను పరిశీలించి, రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక చేసిన అప్పులు తీరక రైతాంగం విలవిల్లాడుతోందని, ఇప్పుడు మళ్లీ మీటర్లు బిగించడం దారుణమన్నారు. రైతుకు నష్టం చేసే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయడాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రమణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, నాగబసిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన ఉత్సవాలు

రామాపురం, జనవరి 1: మండల కేంద్రంలో వెలిసియున్న కేవలానంద లక్ష్మణాచార్య స్వామిజీ ఆరాధన ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నమయ్యరాజుస్వామిని భక్తులు ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా 64 ఏళ్లుగా రాయలసీమ ప్రాంత వాసులచే పూజలందుకుంటున్న స్వామిజీ మండలంలోని తమ ప్రాంతంలో ఉండటం తమ అదృష్టంగా ప్రజలు భావిస్తున్నారు. ఉదయం నుంచి భక్తులు, మహిళలు పెద్దసంఖ్యలో హాజరై ఆరాధనోత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. ఆయనతో పాటు జడ్పీటీసీ మానస వెంకట్రమణ, సింగిల్‌విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, చిన్నరెడ్డి హాజరయ్యారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాలు మంజూరు

చిట్వేలి, డిసెంబరు 1: చిట్వేలి, పెనగలూరు మండలాలకు 500 కేజీల చొప్పున వెయ్యి కేజీల సీఎస్‌హెచ్ 24ఎంఎఫ్ హైబ్రిడ్ జొన్నగడ్డి విత్తనాలు మంజూరయ్యాయని చిట్వేలి ప్రాంతీయ సహాయ సంచాలకుడు ఏడీ వరప్రసాద్ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ మేరకు కేజీ విత్తనాలు రూ.92 కాగా, 75 శాతం సబ్సిడీ పోనూ రైతులు కేజీకి రూ.23 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు స్థానిక పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

పోరు ఆగదు

● అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

● సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్

'మా సమస్యలు పరిష్కరించే వరకు పోరు ఆగదు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదు. ఓట్ల కోసం మమ్మల్ని వాడుకుంటే ఒప్పుకోం' అంటూ అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్షా ఉద్యోగులు తెగేసి చెబుతున్నారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో వీరు నిరసన తెలిపారు. 21వ రోజు సందర్భంగా అంగన్వాడీలు కోలాటాలతో నిరసన తెలుపగా, సమగ్ర శిక్షా ఉద్యోగులు పోస్టుకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఇక మున్సిపల్ కార్మికులు పై అధికారులకు వినతిపత్రం సమర్పించారు.



మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 1: సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొమ్మరాజు భాగ్యలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మలు అన్నారు. రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం రాయచోటిలోని కలెక్టరేట్ ఎదుట సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె 21వ రోజుకు చేరినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర విషయాల్లో ప్రభుత్వం నోరు మెదపలేదన్నారు. గతంలో జరిగిన చర్చల్లో మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని అంగీకరించారన్నారు. ఇప్పటి వరకు దీనికి సంబంధించిన జీవో ఇవ్వలేదన్నారు. తమ సమ్మెకు అపూర్వ మద్దతు లభిస్తోందని, అంగన్వాడీ కేంద్రాలను తెరవాలని ప్రభుత్వం నాలుగు శాఖలతో తలకిందులుగా తపస్సు చేసినా.. ఇప్పటి వరకు ఒక్క పిల్లాడికి కూడా సరైన తిండి పెట్టలేకపోయిందన్నారు. తమ ఆందోళనలకు రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు, లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్లు అనసూయమ్మ, కవిత, పద్మ, జయ, ఉమాదేవి, లక్ష్మిదేవి, విజయమ్మ, రామాంజులమ్మ, నాగమణి, సుమలత, ప్రవీణ, సబీనా, రమీజా, ఇందిరమ్మ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు గత 21 రోజులుగా లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం కోలాటం, భజన కార్యక్రమాలతో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధ్యక్షురాలు కుమారి మాట్లాడుతూ సమ్మెబాట పట్టి 21 రోజులు గడుస్తున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని, డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు దీక్షలు, నిరసనలు, కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు.





రాయచోటిలో పోస్టుకార్డులు చేత పట్టుకొని నిరసన తెలియజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో..

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, రాంబాబులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త సమ్మె 6వ రోజు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లుగా మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం చేయాలని ప్రభుత్వ పెద్దలకు వినతులు సమర్పించినా ఫలితం లేదన్నారు. మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక నాయకులు సిద్దయ్య, అగ్గిరామయ్య, సిద్దమల్లు, అశోక్, రవికుమార్, వెంకట్రమణ, మంగమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20 నుంచి చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం నాటికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను సీఎంకు పోస్టుకార్డుల ద్వారా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయడమే కాకుండా సమాన పనికి సమాన వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన పలు పథకాలను నిర్దేశించిన సమయాల్లో పూర్తి చేస్తున్నామన్నారు. అదేవిధంగా సమగ్ర ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను, టర్మినేషన్ ఆర్డర్స్‌ను మంటల్లో వేసి దహనం చేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపి సంఘీభావం తెలియజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

● సందడిగా మారిన టీడీపీ నాయకుల కార్యాలయాలు









రాయచోటి టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం, జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న టీడీపీ నేతలు, టీడీపీ నేత మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న మైనార్టీ నేతలు, సుగవాసి ప్రసాద్‌బాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్/లక్కిరెడ్డిపల్లె/రాజంపేట/రైల్వేకోడూరు/నందలూరు/ఒంటిమిట్ట/సిద్దవటం/చిట్వేలి, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలు సోమవారం రాయచోటి పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాజకీయ నాయకుల కార్యాలయాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు, ఉద్యోగులు, అధికారులు పూలబొకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డికి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, అభిమానులు పెద్ద ఎత్తున పూలమొక్కలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు, జడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబులను పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, మైనార్టీ నేతలు, ఎంఆర్‌పీఎస్ నేతలు, దళిత సంఘాలు, ఆర్టీసీ యూనియన్ నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రాయచోటి పట్టణంలోని ఎస్‌ఎన్‌కాలనీలో గల మండిపల్లి భవన్ వద్ద రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని పలువురు నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాజంపేటలో నూతన సంవత్సర వేడుకలు

రాజంపేట టీడీపీ నేత గంటా నరహరి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయమే టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తన కార్యాలయానికి చేరుకొని గజమాలలతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఎద్దల విజయసాగర్ ఆధ్వర్యంలో వేదపండితులను పిలిపించి గంటా నరహరికి ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, ఒంటిమిట్ట మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప, నందలూరు నాయకులు, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఎద్దల విజయసాగర్, జిల్లా టీడీపీ కార్యదర్శి సిద్దవటం నాయకులు నాగమునిరెడ్డి, ఒంటిమిట్ట టీడీపీ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, తాళ్లపాక నాయకులు అంజన్ రాజు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, మైనార్టీ నాయకుడు షేక్ మహమ్మద్ అలీ, ఇషాక్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చిన్నయ్య, భువనగిరిపల్లె నాయకులు శంకర్‌లతో పాటు ఆరు మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అదేవిధంగా లక్కిరెడ్డిపల్లెలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రమేశ్‌రెడ్డికి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నందలూరు, ఒంటిమిట్టలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సరం పురస్కరించుకొని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించుకున్నారు. సిద్దవటంలో టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ నాయుడు మరికొందరు నేతలు రాజంపేటలో జగన్ మోహన్‌రాజుకు పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక చిట్వేలిలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కేకు కట్ చేసి పంచి పెట్టారు. అదేవిధంగా రైల్వేకోడూరులో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో నూతన సంవత్సర సంబరాలు జరిగాయి. కార్యకర్తలు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.







టీడీపీ నేత గంటా నరహరికి భారీ గజమాలతో శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ అభిమానులు, కస్తూరి విశ్వనాథనాయుడును సన్మానిస్తున్న దృశ్యం, మేడా విజయశేఖర్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ఆలయానికి రూ.1.50 లక్షలు విరాళం



ఆలయ నిర్వాహకులకు నగదును అందజేస్తున్న దృశ్యం

గాలివీడు, జనవరి 1: మండలంలోని తలముడిపి, కొర్లకుంట పంచాయతీ సరిహద్దులో వెలసిన మహంకాళీ అమ్మవారి ఆలయ అభివృద్ధికి రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన వైసీపీ నాయకుడు ఆర్ఎం చిన్నరెడ్డెన్న కుమారుడు రూ.లక్షా 50 వేలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అత్యంత పురాతనమైన ఈ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ముదిరాజ్ యువసేన అధ్యక్షుడు దేవేంద్రకుమార్, ఏవీ రమణ, రాజశేఖర్, అబ్బాస్, ఆలయ కమిటీ మెంబర్ ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

లక్కిరెడ్డిపల్లె, జనవరి 1: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తుమ్మల వెంకటేశ్వర్లు సోమవారం నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని ఆయన అన్నారు. తనకు సహకరించిన రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, డీసీసీ అధ్యక్షుడు అల్లాబకాష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుభాష్, ఖాదర్‌ఖాన్, అమీర్, బషీర్, చెన్నక్రిష్ణ, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలి

● నియోజకవర్గ టీడీపీ మైనార్టీ నాయకుడు ముస్తాక్‌హుస్సేన్



కేక్ కట్ చేస్తున్న మైనార్టీ నేత ముస్తాక్‌హుస్సేన్

రాయచోటిటౌన్, జనవరి1: నూతన ఏడాదిలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ మైనార్టీ నాయకుడు ముస్తాక్‌హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని కడప- చిత్తూరు జాతీయ రహదారిపై గల పెట్రోల్ బంకు సమీపంలోని టీడీపీ కార్యాలయంలో పలువురు మైనార్టీ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్నేహితులతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ ఏడాదిలో నియోజకవర్గ ప్రజలంతా ఎటువంటి వైషమ్యాలకు లోను కాకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని ఆకాంక్షించారు.

బీజేపీలో చేరిన పలువురు నేతలు

రాజంపేటటౌన్, జనవరి 1: రాజంపేటలో బీజేపీ జిల్లా కార్యదర్శి సమ్మెట నరేంద్రరాజు ఆధ్వర్యంలో మందపల్లె, గుండ్లూరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేశ్ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సాయిలోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి గజపతిరాజు, కృష్ణాయాదవ్, అసెంబ్లీ కో-కన్వీనర్ రాంప్రసాద్ తదితరులు మాట్లాడుతూ నేడు దేశంలో 20 కోట్ల సభ్యత్వాలు కలిగి ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ మోర్చ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, సురేష్‌రాజు, పోతుగుంట నాగేశ్వరరావు, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షుడు సునీత నారాయణవర్మ, హరి, ప్రసాద్, నరేంద్రరాజు, మాజీ సర్పంచ్ రామయ్య పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

ఓబులవారిపల్లె, జనవరి 1: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలు మంగంపేట గ్రామంలో ప్రతి ఇంటికి చేరవేశామని యువకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సంఘం ప్రచార సభ్యులతో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా రామనామ స్మరణ చేస్తూ ఉత్సాహంతో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చరణ్, హరిబాబు, శివయ్య, సాకే సుబ్బరామయ్య, గంట రాజా, సాయి, బొక్కసం అనిల్, నికిల్, కార్తీక్, మణి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

ఓబులవారిపల్లె, జనవరి 1: నూతన సంవత్సర సందర్భంగా పలు పథకాలపై ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్ సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తపాలా కేంద్రం ద్వారా ఎన్నో మేలైన పథకాలు అమలు జరుగుతున్నాయని, ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు వ్యక్తులకు అప్పులు ఇవ్వడం ద్వారా ఇబ్బందులు తప్పవన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, తపాలా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఆలయాలు

సంబేపల్లె, జనవరి 1: మండల పరిధిలో నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. మోటకట్ల శివాలయం, అడవికమ్మపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయం, దేవరాయి నల్లగంగమ్మ ఆలయాల్లో విశేషంగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీప అలంకరణలతో ముస్తాబు చేశారు. చెక్కభజనలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి.

తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధాకర్



నారా లోకేశ్‌తో సుధాకర్

సుండుపల్లె, జనవరి 1: జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన గుండ్లపల్లి సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పార్టీలో యువతకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వినూత్నంగా సంబరాలు



నారా లోకేశ్, చంద్రబాబు కటౌట్లకు స్వీట్లు తినిపిస్తున్న పంతగాని నరసింహప్రసాద్

రైల్వేకోడూరు, జనవరి 1: రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం రైల్వేకోడూరులో వినూత్నంగా సంబరాలు జరుపుకున్నారు. తన ఇంటి వద్ద మాజీ సీఎం చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి నారా లోకేశ్, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ల కటౌట్లు ఏర్పాటు చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడమే కాకుండా స్వీట్లు తినిపించినట్లుగా సంబరాలు చేశారు. ఇది అందరినీ ఆకట్టుకుంది. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో టీడీపీ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పంతగానిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు సభాపతి, యువ నాయకుడు కస్తూరి దినేశ్, దళిత నాయకుడు చంద్రయ్య, వాల్మీకి సంఘం నాయకులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మినీ సంక్రాంతిలా నూతన సంవత్సర వేడుకలు



గుంజన అలుగుపై నీటిలో సందడి చేస్తున్న పరిసర ప్రాంతాల ప్రజలు

పెనగలూరు, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను సోమవారం మండల ప్రజలు మినీ సంక్రాంతి పండుగ తరహాలో జరుపుకున్నారు. ధనుర్మాస పూజలు కూడా జరుగుతున్నందున వేకువజాము నుంచి ప్రజలు దేవాలయాలకు వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 50 శాతం ఇళ్లలో నూతన సంవత్సర కేకులను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆహ్లాద వాతావరణానికి అనుకూలమైన గుంజన అలుగుపై పారుతున్న నీటి ప్రవాహంలో యువత, విద్యార్థులు, చిన్నారులు సైతం సందడి చేశారు.

అంగన్వాడీలకు అండగా సీపీఐ

సుండుపల్లె, జనవరి 1: అంగన్వాడీ కార్మికులకు సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విశ్వనాథ్‌నాయక్ తెలిపారు. మండలంలో 21 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తుంటే న్యాయం చేయాల్సిన ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ డిమాండ్లను పరిష్కరించకుండా ఉద్యోగుల మధ్య చిచ్చుపెట్టి నాటకాలు ఆడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా 3న కలెక్టర్ కార్యాలయాల వద్ద ఛలో కలెక్టరేట్ పేరుతో ముట్టడిస్తామని హెచ్చరించారు.


పీఎస్ఎల్వీ-సీ 58 తొలి దశ


రెండో దశ


మూడో దశ


నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

గఘన విజయం

కొత్త ఏడాది తొలి ప్రయోగ విజయంతో షార్‌లో సంబరోత్సాహాలు



సూళ్లూరుపేట, జనవరి 1: పీఎస్ఎల్వీ 60వ ప్రయోగం శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో కొత్త ఉత్సాహం నింపింది. సంవత్సరం ప్రారంభపు రోజున ఇస్రోకి లభించిన విజయంగా భావిస్తున్నారు. ఇస్రో విజయాశ్వంగా భావించే పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ సోమవారం ఉదయం ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంతో పాటూ కీలక పరిశోధనలకు ఉపయోగపడే పది పరికరాలను అంతరిక్షంలోకి చేర్చింది. ఇస్రో భవిష్యత్ ప్రయాణానికి ఈ ప్రయోగాలు చాలా ప్రాధాన్యం కలిగినవి.

సంబరాలు

ఆదివారం ఉదయం 8.10 గంటలకు మొదలైన రాకెట్ కౌంట్‌డౌన్ 25 గంటల పాటు కొనసాగింది. సోమవారం ఉదయం 9.10 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ గగనతలంలోకి పీఎస్ఎల్వీ దూసుకెళ్లింది. ఏ రకమైన తడబాటు లేకుండా నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని, పరికరాలనూ ప్రవేశపెట్టడంతో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. శాస్త్రవేత్తలు, ఇస్రో ఉద్యోగులు పరస్పరం అభినందించుకుంటూ కనిపించారు. హ్యాపీ న్యూ ఇయర్‌తో పాటూ కంగ్రాట్స్ అనే మాట అందరినోటా వినిపించింది.విజిటర్స్ గ్యాలరీలో ప్రయోగాన్ని చూసేందుకు వచ్చినవారి చప్పట్లతో, ఈలలతో ఆ ప్రాంతం మార్మోగింది. అంతరిక్షంలోకి పంపిన పది పరిశోధక పరికరాల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా శ్రీహరికోట నుంచి ప్రయోగాన్ని వీక్షించారు.



భక్తులతో పోటెత్తిన బోయకొండ



చౌడేపల్లె, జనవరి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా గంగమ్మ భక్తులతో పోటెత్తింది. సోమవారం ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, పంచామృతాభిషేకాలు నిర్వహించి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆంగ్ల నూతన సంవత్సరం కావటంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లును ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకు యువకుడి బలి


మృతిచెందిన త్యాగయ్య

బంగారుపాళ్యం, జనవరి 1: అటవీ జంతువుల వేటకోసం ఏర్పాటు చేసిన కరెంటుతీగల ఉచ్చులోపడి ఓ యువకుడు మృతిచెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి బంగారుపాళ్యం మండలంలోని పెరుమాళ్ళపల్లెలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అడవిజంతువులను వేటాడేందుకు వేటగాళ్లు పొలాల వద్ద కరెంటు తీగలతో ఉచ్చు ఏర్పాటు చేశారు. పెరుమాళ్ళపల్లికి చెందిన సురేష్ పొలం మీదుగా అదే గ్రామానికి చెందిన బాలరాజు కుమారుడు త్యాగయ్య(35) తమ మామిడి తోట వద్దకు ఆదివారం రాత్రి వెళ్లారు. ఆ సమయంలో సురేష్ పొలం వద్ద వేటగాళ్లు అమర్చిన కరెంటు తీగల ఉచ్చును ఆయన గుర్తించలేదు. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురై పొలంలోనే మృతిచెందారు. ఇతడు చిత్తూరులోని ఓ బంగారు దుకాణంలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నారు. భార్య శోభ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ నాగరాజరావు తెలిపారు.

11మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు

ఏటిగడ్డపాళ్యం గొడవ వివాదం

పుంగనూరు, జనవరి 1: పుంగనూరు ఏటిగడ్డపాళ్యంలో శనివారం రాత్రి కర్రలు, రాడ్లతో ఇళ్లలోకి చొరబడి దాడి చేసిన 11మందిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుకుమార్ తెలిపారు. 'పుంగనూరుకు చెందిన కొందరు గతనెల 30వ తేది రాత్రి తమ ఇళ్లలోకి దూరారు. మీరు బర్త్‌డే చేసుకోవాలంటే టిప్పుసుల్తాన్ జెండాలు తీస్తారా? ఎంత ధైర్యం, మీ అంతు చూస్తాం' అంటూ కొట్టి గాయపరిచారని ఏటిగడ్డపాళ్యంకు చెందిన రెడ్డెప్ప భార్య ఎం.శాంతమ్మ ఫిర్యాదు చేశారన్నారు. పుంగనూరుకు చెందిన నవాజ్, ఖాజా, ఇంతు, నూర్, సుహైల్, అమీన్, చోటు, పీరు, అస్లాం, సుబీర్, ముబారక్‌తోపాటు మరికొందరు కొట్టడమే కాకుండా ధనకొండ గంగమ్మ గుడిపై రాళ్లు, కర్రలు విసిరి భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. దీంతో వారిపై దాడి, ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కలినరీ ఇన్‌స్టిట్యూట్ దక్షిణ భారతావనికి వరం

అడ్మిషన్లు మరింతగా పెంచాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 1: తిరుపతిలోని పాకశాస్త్ర సంస్థ దక్షిణ భారతావనికి వరం లాంటిదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభివర్ణించారు. సోమవారం ఆయన కలినరీ ఇన్‌స్టిట్యూట్‌ను పరిశీలించారు. ఫ్యాకల్టీతో మాట్లాడారు. అడ్మిషన్లు తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. అన్ని కోర్సులకు అడ్మిషన్లు పూర్తయిన తర్వాత ఇక్కడ అడ్మిషన్లు జరుగుతున్నాయని, రెండేళ్లగా అంతకంటే ఎక్కువ ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఫ్యాకల్టీ మంత్రికి వివరించారు. సిబ్బంది కొరతను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అకడమిక్ విషయాలు, వసతులు, ఫ్యాకల్టీ సామర్థ్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. సంస్థకు మరిన్ని నిధులు అందిస్తామన్నారు. కలినరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ తిరులోగ చందన్, పర్యాటక శాఖ సౌత్‌జోన్ రీజనల్ డైరెక్టర్ వెంకటేషన్ దత్తాత్రేయన్, అలిపిరి సమీపంలోని ఎస్ఐహెచ్ఎం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసు అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి - ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రెవెన్యూ, ఇతర ఉద్యోగసంఘాల నాయకులు - జడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న ఎంపీడీవోలు, పీఆర్, ఇతర శాఖల అధికారులు

కలెక్టరేట్‌లో న్యూఇయర్ వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 1: అధికారులు ఇనుమడించిన ఉత్సాహంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడపడంలో భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు జిల్లాకేంద్రంలో పలుచోట్ల ఘనంగా జరిగాయి. కలెక్టర్ షన్మోహన్ విజయవాడలో సీఎం పేషీకి వెళ్లారు. ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న జేసీ పి.శ్రీనివాసులు సోమవారం మధ్యాహ్నం డీఆర్వో రాజశేఖర్, జేసీ క్యాంపు ఆఫీసు సిబ్బంది, జిల్లా అధికారులతో కలిసి కేక్ కట్‌చేశారు. ఈయనకు పలువురు అధికారులు దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జేసీ క్యాంపు కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి జేసీ దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డిని పలువురు ఎంపీడీవోలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు కలిసి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

చిత్తూరు: ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్పెషల్ బ్రాంచ్, ఏఆర్ అధికారులు, జిల్లా పోలీసుకార్యాలయంలో పనిచేసే సిబ్బంది, పలువురు సీఐలు, ఎస్ఐలు సబ్ డివిజన్ల వారీగా అధికారులు ఎస్పీకి పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి, నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీలు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు

మదనపల్లెఅర్బన్, జనవరి 1: నూతన సంవత్సర 2024 వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు కాగానే కొత్త వెలుగులు రావాలని కోరుకుంటూ యువత ఆనందంగా కేక్‌లను కట్‌చేసి సంబరాలను చేసుకున్నారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో న్యూఇయర్ వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే బర్మావీధిలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆలయకమిటీ ఉపాధ్యక్షుడు నాదేళ్లబాబు నాయుడు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో ఈవో రమణ ఆధ్వర్యంలో, నీరుగట్టువారిపల్లె నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆలయ దర్మకర్త గుడి రామాంజులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు పట్టణంలోని రెడ్డెప్ప నాయుడు కాలనీ చెందిన దాతలు మేకల తులసిరాం, మేకల రాధాకృష్ణ, బాలాజీ అన్నదానం చేశారు. చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరుడికి విశేషపూజలు నిర్వహించారు.

పీలేరులో: నూతన సంవత్సర వేడుకలను పీలేరు మండల ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత యువత ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ స్వాగతం పలికారు. ఏడాది తొలిరోజున దైవదర్శనం చేసుకుంటే ఏడాదంతా శుభం కలుగుతుందన్న సెంటిమెంటుతో తమ ఇష్టదైవాల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దీంతో పీలేరులోని కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వర స్వామి, సాయిబాబా, చెన్నకేశవ స్వామి, అగ్రహారం లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం జరిగాయి.

పీలేరులో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు మదనపల్లె, రాయచోటి పట్టణాల్లోని తమ ఉన్నతాధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గుర్రంకొండలో:నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి వారికి అర్చకులు ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహిం స్వామి వారిని విశేషంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి వేలాది భక్తులు వచ్చారు. అలాగే మండలంలోని చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులకు అనుగుణంగా ఆలయాల వద్ద అన్నదానాలను ఏర్పాటు చేశారు. చారిత్రాత్మక కట్టడమైన గుర్రంకొండ కోటకు సందర్శకులు అధికంగా వచ్చారు. ఈ క్రమంలో కోటలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కలకడలో:నూతన సంవత్సర వేడుకలను పురష్కరించుకొని మండలంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కలకడ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నడిమిచెర్లలోని కోదండరామాలయం, గోపాలపురంలోని షిర్డీసాయిబాబా మందిరం, బాటవారిపల్లెలోని పంచముఖ ఆంజనేయస్వామి , కోన చౌడేశ్వరీ దేవి ఆలయాలను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వాల్మీకిపురంలో: నూతన సంవత్సరం 2024 వేడుకలను వాల్మీకిపురం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. న్యూ ఇయర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే పలు ప్రాంతాలలో బాస్కెట్ బాల్, బాడ్మింటన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సోమవారం ఉదయం నుంచి ఆలయాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి. స్థానిక కోనేటివీధిలోని శివాలయంలో కామేశ్వరస్వామికి, సాయినగర్‌లో గల షిరిడీసాయి బాబా ఆలయంలో, పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం ఆల యాలలో విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానాలు చేపట్టారు. కార్యక్రమాలలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, హరిస్వామి, శీనాస్వామి, ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కురబలకోటలో: మండలంలో నూతన సంవత్సర సంబరాలు సోమవారం అంబరాన్నంటాయి. అంగళ్లు బస్టాండు, మిట్స్ కళాశాల తదితర చోట్ల యువకులు కేక్ కట్ చేసి పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల చర్చిలలో ధార్మికోపన్యాసం నిర్వహించి కేక్ కట్‌చేశారు. అలాగే రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ కార్యదర్శి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలికిరిలో తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజక వర్గానికి చెందిన పలువురు నేతలు మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌ను మదనపల్లె టీడీపీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. నియోజకవర్గానికి చెందిన తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, రాజంపేట పార్లమెం టరీ తెలుగు ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మొటుకు శివ, కురబలకోట మడల కన్వీనర్ వైజీ సురేంద్ర, వైజీ రమణ, వెంక్రమణ పాల్గొన్నారు.


పీలేరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ


మదనపల్లెలో ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా


గుర్రంకొండలో భక్తులతో రద్దీగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయం


సందర్శకులతో కిటకిటలాడుతున్న గుర్రంకొండ కోట

రాజకీయ పార్టీ నేతలకు శుభాకాంక్షల వెల్లువ

● కేక్ కటింగ్‌లతో కొత్తసంవత్సర వేడుకలు

మదనపల్లె/టౌన్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురష్కరించుకుని సోమవారం ప్రజాప్రతి నిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ, కొంగొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ..సోమవారం తెల్లవారు జామున నుంచే కొత్త ఏడాది వేడుకలు ప్రారంభమయ్యాయి. సరిగ్గా రాత్రి 12గంటలకు పార్టీనాయకులు, కార్యకర్తలు వేర్వేరుగా కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అప్పటి నుంచి మధ్యాహ్నం వరకూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వారి అభిమానులు, ఆత్మీయులు నాయకులు ఇళ్ల వద్దకు వెళ్లి శాలువతో సన్మానిస్తూ, పూలమాలతో సత్కరిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులోభాగంగా నేతలు కేక్ కటింగ్ చేసి కార్యకర్త లకు పంచిపెట్టారు. ఇందులోభాగంగా స్థానిక ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా నివాసానికి నియోజకర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు భారీగా తరలివచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్‌కు మదనపల్లెలోని సొసైటీకాలనీలోని టీడీపీ కార్యాలయంలో నియోజవకర్గం వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు తరలివచ్చి కేక్ కట్ చేసి, అభిమాన నేతకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ నేత గంగారపు బాబురెడ్డికి బసినికొండ, గంగన్న గారిపల్లె, రామాచార్లపల్లె, గంగమ్మగుడి ఏరియాకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చి కేక్ కట్ చేశారు. స్థానిక కమ్మ వీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్ చౌదరి, నియోజకవర్గ ఇన్‌చార్జి గంగారపు స్వాతిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులోభాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్ ఆధ్వర్యంలో కేట్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే బర్మావీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులును జనసైనికులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి దారం అనిత, దారం హరిప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కొత్తసంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సదుంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటాచలపతి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లెలోని టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేశ్, షాజహాన్‌బాషాలకు పార్టీ నాయకులు నూతన సంవత్స రం శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్‌ను పార్టీ క్యాడర్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిద్దప్ప, ఆర్‌జే వెంకటేశ్, భవానిప్రసాద్, దేవరింటి శ్రీని వాసులు, కత్తి లక్ష్మన్న, రామసముద్రం, నిమ్మనపల్లె టీడీపీ నాయకులు వచ్చి దొమ్మలపాటికి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సుభాష్‌వీధిలోని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాసం లో జహా యువసనే ఆధ్వర్యంలో పెన్సిల్ తో గీసిన షాజహాన్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, షంషీర్, నాగూర్‌వలి, విజయమ్మ పాల్గొన్నారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబును మదనపల్లె, పుంగనూ రు, పీలేరు, తంబళ్లపల్లె తెలుగు యువత నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్ష లు తెలిపారు. శాస్త్రి వీధిలోని మాజీ ఎమ్మెల్యే శోభ నివాసంలో సీనియర్ టీడీపీ నేత రాటకొండ బాబురెడ్డిని నియోజకవర్గంలోని పలువురు నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ మైనారిటీ నేత మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ టీడీపీ నేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

ములకలచెరువులో: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త దాసరిపల్లి జయచంద్రారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ములకలచెరువులోని ఆయన నివాసంలో సోమవారం పలువురు టీడీపీ నాయకులు, మద్దతుదారులు, మొరుసు కాపు సంఘం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కుక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. అలాగే బురకాయలకోటకు వెళ్లి ఇటీవల జరిగిన దాడిలో గాయపడ్డ బీజేపీ నేత గోపాల్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమాల్లో నాయకులు గిరిధర్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, శంకర్‌రెడ్డి, భజంత్రి రామాంజులు, మస్తాన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎం మండలంలో తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసిరిపల్లె జయచంద్రారెడ్డి సోమవారం విస్తృత పర్యటన చేశారు సోమవారం దేవప్పకోట పంచాయతీ దొరుగుండ్లవారిపల్లెలో గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి తన వంతు సహాయంగా 1,00,116 లను గ్రామ పెద్దల సహకారంతో విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పోతుపేట గ్రామంలో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి రూ. 2,00,116 విరాళంగా ప్రకటించారు. గ్రామంలో పెద్దలు, మహిళలు అందరూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవప్పకోట సర్పంచ్ సునితాసురేష్, పోతుపేట సర్పంచ్ కొండా కళావతి, చిన్నపరెడ్డి, టీడీపీ నాయకులు పట్టా చంద్రమోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్ రెడ్డి. మధుసూదన్‌రెడ్డి, మునిరెడ్డి, రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, ఆంజనేయరెడ్డి, పెద్ద వెంకట్రమణ, రెడ్డెప్ప, ఎం. శంకర, తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు


బసినికొండ టీడీపీ నేత గంగారపు బాబురెడ్డితో పార్టీశ్రేణులు


జనసేననేత రామ్‌దాస్‌చౌదరిని సన్మానిస్తున్న అభిమానులు


నియోజకవర్గ నేత రామాంజనేయులును సన్మానిస్తున్న జనసైనికులు


ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు శుభాకాంక్షలు చెబుతున్న సీనియర్ నేత సీపీ సుబ్బారెడ్డి


మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నేతలు


తెలుగు యువత నేత శ్రీరామ్‌చినబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


ములకలచెరువులో టీడీపీ నేత జయచంద్రారెడికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఖాదర్‌ఖాన్

ఆట, పాటలతో అంగన్వాడీల నిరసనలు


మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు


తంబళ్లపల్లెలో ఆవుకు వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీలు


వాల్మీకిపురంలో కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మదనపల్లె టౌన్, జనవరి 1: నూతన సంవత్సరం తొలిరోజు సోమవారం కూడా అంగన్వాడీలు ఆటపాటలతో సమ్మెను కొనసాగించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు కోలాటాలు వేస్తూ, జెక్కీకి ఆడుతూ ప్రభుత్వంపై నిరసనలు తెలిపారు. అర్హులైన అంగన్వాడీ హెల్పర్లకు పదోన్నతి కల్పించాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం గ్రాట్యూటి చెల్లించాలన్నారు. అంగన్వాడీ లబ్దిదారులకు నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం ప్రభాకర్‌రెడ్డి, సీఐటీయూ నాయకురాళ్లు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో అంగన్వాడీలు నిరసన చేపట్టారు. కబడ్డీ ఆడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆటలో కూతలు పెట్టి నిరసన తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పైనపట్టిన మొండి పట్టు విడిచి డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మె మరింత ఉధృతం చేస్తామన్నారు. తమ స్థానంలో కేంద్రాలలో ప్రత్యామ్నాయ సేవలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, గులాబ్‌జాన్, నజీమున్నీసా, లక్ష్మీప్రసన్న, నరసమ్మ, దేవసేన, రెడ్డిరాణి, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తమ న్యాయపరమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం ఆవుకు వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మల్లయ్యకొండకు చేరుకుని మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని ఈ ప్రభుత్వానికి సద్బుద్ధి కలిగించి..మా కోర్కెలు తీర్చు స్వామి అని మొక్కుకున్నారు. గత 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. అనంతరం కొండ పైన ఉన్న ఆవుకు వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాళ్లు సులోచన, కరుణశ్రీ, స్వరూపారాణి, ఉమాదేవి, గౌరి, శివమ్మ, పరమేశ్వరీ పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో : తమ డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 21వ రోజుకు చేరింది. బి.కొత్తకోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సోమవారం నూతన సంవత్సరం అయినా కూడా అంగన్వాడీలు ధర్నా చేశారు. శిబిరంలోనే పాటలు పాడారు, ఆటలు ఆడారు. ఈ సందర్భంగా యూనియన్ లీడర్లు శ్రీవాణి, కుమారి, ఈశ్వరీలు మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజున కుటుంబంతో కలిసి ఏదైనా గుడికి వెళ్లాల్సిన అంగన్వాడీ కార్యక్తలు ఇలా ధర్నాలో పాల్గొనాల్సి రావడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి విడిచి అంగన్వాడీల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు, కార్యక్రమంలో ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు మంచి కాలం

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి


కలికిరిలో భారీ కేకును కట్ చేసి అమనాథరెడ్డికి తినిపిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి


వాల్మీకిపురంలో నల్లారిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

కలికిరి, జనవరి 1: నూతన సంవత్సరం ప్రారంభం దగ్గర నుంచి ఇక తెలుగు ప్రజలకు అంతా మంచే జరుగు తుందని టీడీపీ జాతీయ ప్రధాన క్యార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం నగరిపల్లెకు పోటెత్తిన టీడీపీ శ్రేణులతో ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు ప్రజలు భరించిన అన్ని రకాల కష్టాలు ముగింపు దశకు చేరుకున్నాయని, రాబోయే రోజులన్నీ ప్రజలకు సుఖశాంతులు కలిగిస్తాయని చెప్పారు. రాబోయే సంక్షేమ రాజ్యంలో రైతులు, మహిళలు, యువత సంతోషంగా ఉంటారన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కిశోర్‌కుమార్ రెడ్డితో పాటు ఆయన తనయుడు టీడీపీ యువనేత నల్లారి అమరనాథ రెడ్డితో కలిసి వివిధ రకాల వేడుకల్లో పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా వేడుకలకు అంచనాలకు మించి అనూహ్య రీతిలో కిశోర్‌కుమార్ రెడ్డి స్వగ్రామం టీడీపీ శ్రేణులతో కిక్కిరిసిపోయింది. ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు నగరిపల్లెకు క్యూ కట్టారు. ప్రధానంగా పుంగనూరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల నుంచి వచ్చిన శ్రేణుల నినాదాలతో గ్రామం దద్దరిల్లింది. తంబళ్లపల్లె నుంచి కీలకమైన నాయకుల సారథ్యంలో దాదాపు 150 వాహనాల్లో వచ్చిన టీడీపీ వర్గీయులు తరలివచ్చారు. కేవీ పల్లె నుంచి తెచ్చిన భారీ కేకు కిశోర్‌కుమార్ రెడ్డి కట్ చేసి అనుయాయులకు తినిపించారు.

పీలేరులో:నూతన సంవత్సర వేడుకల సందర్భంగా టీడీపీ శ్రేణులు తమ నేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలికిరి మండలం నగరిపల్లెకు పార్టీశ్రేణులు తరలి వెళ్లారు.

వాల్మీకిపురంలో:వాల్మీకిపురం మండలానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు నగిరిపల్లెలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు. కొత్త సంవత్సరం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుచిజీ మల్లికార్జునరెడ్డి, పార్టీ తెలుగు యువత అధ్యక్షుడు లంకిపల్లె మధు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ద్వారకనాథరెడ్డి, నాయకులు గాంధీపేట రమణ, పీవీ నారాయణ, చంద్రమౌళి, వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, గుర్రెడ్డి చంద్రారెడ్డి, కేవీ రెడ్డి, ఆదినారాయణ, మురళి, మైనార్టీ అధ్యక్షులు సయ్యద్‌బాషా, చాను, రెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలకడలో:టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సోమవారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, మల్లికార్జుననాయుడు, రైస్‌మిల్ రమణ, విశ్వనాథ్, ఈశ్వరయ్య, తారకేశ్వర, త్యాగరాజు, రెడ్డెప్ప, రెడ్డిశేఖర్, జనార్ధన్‌నాయుడు, కరీముల్లా, జిలానీ, మెకానిక్ రమణ, ఇర్ఫాన్, ఖాజా, ముబారక్‌అలీ, జాహిద్, సలీం పాల్గొన్నారు.

గుర్రంకొండలో:టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని గుర్రంకొండ టీడీపీ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి అందరికి పంచారు. కార్యక్రమంలో పార్టీ నేతలు జగదీష్‌కుమార్, రెడ్డిప్రసాద్‌నాయుడు, మేకల చలపతి, రాము, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పీటీఎంలో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతు

పెద్దతిప్పసముద్రం జనవరి 1 : పీటీఎం దళిత వాడకు చెందిన గంగాద్రి అలియాస్ ధర్మా అనే యువకుడు చేపల వేటకు వెళ్లి గల్లంతైన సంఘటన పీటీఎంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీటీఎం దళిత వాడకు చెందిన కోనప్పల్లి కిట్టన్న కుమారుడు గంగాద్రి అలియాస్ ధర్మా సోమవారం మధ్యాహ్నం కొందరు స్నేహితులతో కలిసి పీటీఎం చెరువులో చేపల వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు గంగాద్రి చెరువులో పడిపోయాడు. అతనితో కలసి వెళ్లిన స్నేహితులు వచ్చి ఇంటి దగ్గర చెప్పారు అయితే గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లే సరికి అప్పటికే ఆ యువకుడు నీట మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని ములకలచెరువు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు.ఫైర్ సిబ్బంది ఎంత వెదికినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. చీకటి పడడంతో గాలించడం కుదరదని మంగళవారం ఉదయం ఫైర్ సిబ్బంది గాలించి అతని మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తామన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, జనవరి 1: రైలు కిందపడి రామాంజులు(30) అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు...ములకలచెరువు మండలం పెద్దపాళ్యం పంచాయతీ అంగజాలపల్లెకు చెందిన రవణప్ప కుమారుడు డేరంగుల రామాంజులు భార్య చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈక్రమంలో జీవితం మీద విరక్తి చెంది పెద్దపాళ్యం సమీపంలో తిరుపతి నుంచి గుంతకల్లుకు వెళ్తున్న ప్యాసెంజర్ రైలు కింద పడ్డాడు. దీంతో యువకుడి చెయ్యి తెగిపోయి పరిస్థితి విష మంగా మారింది. తీవ్రంగా గాయపడ్డ యువకుడిని చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె టౌన్, జనవరి 1: మదనపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ గుర్తుతెలియని వ్యక్తి(52) మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్టాండు వద్ద వ్యక్తి మృతి చెంది ఉండటం గమనించిన సిబ్బంది టుటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య అక్కడికి చేరుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కాగా వారం రోజుల్లో మదనపల్లె పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు బిక్షగాళ్లు ముగ్గురు మృతి చెందడం గమనార్హం.

ముగ్గురు జూదరుల అరెస్టు

గుర్రంకొండ, జనవరి 1:జూదరులపై పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. చెర్లోపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ముగ్గుర్ని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.3600 స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా బాహుదా మత్స్య సహకార సంఘ ఎన్నికలు


సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన రమణయ్య తదితరులు

నిమ్మనపల్లి, జనవరి 1: మండలంలోని బాహుదా మత్స్య సహకార సంఘం ఎన్నికలు సోమవారం బాహుదా ప్రాజె క్టు వద్ద ఉన్న మత్స్యశాఖ కార్యాలయంలో ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల అధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. ఎన్నికలు జరిగి 5ఏళ్లు పూర్తి కావడంతో కొత్త సొసైటీ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఎన్నికలకు 21 మంది డైరెక్టర్‌లు హాజరు కాగా మిగిలిన ముగ్గురు అనా రోగ్యం కారణంగా ఓటింగ్‌లో పాల్గొనలేదని తెలిపారు. దీంతో సొసైటీ సభ్యులచే ఎన్నికలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పారప ట్ల రమణయ్యను ఎన్నుకోగా ఉపాధ్యక్షుడుగా రమణా రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు సభ్యులు సంతకాలతో కూడిన పత్రాన్ని ఎన్నికల అధికారికి అందజేశారు. దీంతో ఎన్నికల అధికారి వారి అనుమతితో రమణయ్యను అధ్యక్షు డుగా, రమణారెడ్డిని ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు. అనం తరం ఎన్నికైన వారికి డిక్లరేషన్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో సుబ్బనరసయ్య, సభ్యులు శ్రీరా ములు, రెడ్డెప్ప, శ్రీనివాసులు, చెంద్రాయుడు, ఔషన్న, క్రిష్టప్ప, క్రిష్టయ్య, చెన్నప్ప, నారాయణ పాల్గొన్నారు.

దీక్షలను విజయవంతం చేయండి

మదనపల్లెఅర్బన్, జనవరి 1: రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులకు రావాల్సిన దీర్ఘకాలిక బకాయిల కోసం ఈ నెల 3న జిల్లా కలెక్టర్‌కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసన దీక్షను విజయవంతం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ నెల 3న జిల్లాస్థాయిలో 6న రాష్ట్ర స్థాయిలో నిరసన దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ సుధాకర్, పట్టణ అధ్యక్షుడు భానుమూర్తి, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, శ్రీనప్ప, బెల్లం సుధాకర్, హసన్‌బాష, రామ్మోహన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీలకు మదనపల్లె విద్యార్థి

మదనపల్లె టౌన్, జనవరి 1: దుబాయ్‌లో జరిగే అంతర్జాతీయ త్రోబాల్ పోటీలకు మదనపల్లె బీటీ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన బి.మౌనిష్ అంతర్జాతీయ త్రోబాల్ పోటీలో దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ స్థాయిలో త్రోబాల్ పోటీల్లో రాణించిన మౌనిష్ గత మార్చిలో బంగ్లాదేశ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో మనదేశం తరపున ఆడాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు దుబాయ్‌లో నిర్వహించనున్న సౌత్ వెస్ట్ ఏసియా అంతర్జాతీయ త్రోబాల్ మౌనిష్ ఎంపికయ్యాడు. ఈ క్రమంలో ఏసియన్ త్రోబాల్ ఫెడరేషన్ నుంచి ఉత్తర్వులు అందుకున్నాడు. ఈనెల 28, 29 తేదీల్లో బెంగళూరులోని గోపాలన్ ఇంటర్నేషనల్ స్కూల్లో త్రోబాల్ శిక్షణలో మౌనిష్ పాల్గొనున్నట్లు బీటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి

పెద్దమండ్యం, జనవరి 1: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్ పిలుపు నిచ్చారు. మండలంలోని కలిచెర్ల లోని మండల పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో రాజకీయ గుర్తింపు తెచ్చుకొన్న వాళ్లతా పార్టీకి ద్రోహం చేసి వెళ్లి పోయారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజవర్గాలలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లాబక్స్ స్పష్టం చేశారని వెల్లడించారు. పార్టీ జిల్లా, మండల యువ నాయకులు ఫయాజ్, జావీద్, ఇర్ఫాన్, ఖాదర్ షరీఫ్, ముజీబ్, శీన తదితరులు పాల్గొన్నారు.


బహుజనులు ఉద్యమించాలి

పీలేరు, జనవరి 1: బీమా కోరేగావ్ యుద్ధాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి బహుజనులు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పీలేరుకు చెందిన పలువురు ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బీమా కోరేగావ్ 206వ శౌర్య దివస్‌ను వారు సోమవారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీకుమార్, జెట్టి మల్లిఖార్జున, గట్టప్ప, ఆనంద్, లోకనాథం, 'బాస్' నేత పాలకుంట శ్రీనివాసులు, దారుస్సలాం వెల్ఫేర్ ట్రస్టు అధ్యక్షుడు అత్తార్ బోదేషా, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వేలూరు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ క్యాలెండర్ ఆవిష్కరణ

కలికిరి, జనవరి 1: రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ ప్రచురించిన టీడీపీ నూతన సంవత్సరం కాలెండర్‌ను సోమవారం నగరిపల్లెలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, యువ నేత నల్లారి అమరనాథ రెడ్డి కలిసి ఆవిష్కరించారు. అందంగా, అర్థవంతంగా పార్టీ ప్రచారం కోసం క్యాలెండర్ ముద్రించిన చంద్రశేఖర్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనుబంధ విభాగాలకు చెందిన నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, కేవీ రెడ్డి, సుధాకర్ రెడ్డి, చిన్నరెడ్డెయ్య, వర్మ, రెడ్డరాము, అగస్తీశ్వర, మాలతి, సల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేసి ప్రజలకు సేవలందిద్దాం


ఆర్డీవో మురళికి శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

మదనపల్లె టౌన్, జనవరి 1: విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు కలసికట్టుగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందిద్దామని ఆర్డీవో మురళి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో ఆర్డీవో మురళిని 11 మండలాల నుంచి తహసీల్దార్‌లు, రెవెన్యూ అధికారులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీవో మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ఎన్నికలు వస్తున్నాయని విధి నిర్వహణలో ఖచ్చితత్వం ఉండేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఏవో శేషయ్య, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎం బాబ్జి తదితరులు పాల్గొన్నారు. కాగా మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాల వద్ద పోర్డు సంస్థ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహం, ఏడీఎస్ వద్ద బీసీ బాలికల వసతి గృహం వద్ద విద్యార్థినుల మధ్య పోర్డు సంస్థ డైరెక్టర్ లలితమ్మ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. వార్డెన్ పద్మావతి పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరామ అక్షింతల పంపిణీ ప్రారంభం

కలికిరి, జనవరి 1: అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సోమవారం నగరిపల్లెలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో ఇంటింటి అక్షింతలు, చిత్రపటాలు పంపిణీ అయ్యేటట్లు చూడాలని కోరారు. అవసరమైతే గ్రామాల్లో యువ కార్యకర్తల సహకారాన్ని తీసుకోవలసిందిగా సూచించారు. కాగా అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలు, అయోధ్య చిత్రపటాలను ఇంటింటికీ చేర్చే కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించినట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి చింతపర్తి మహేష్ పేర్కొన్నారు. ఈ నెల 22న అయోధ్య రామాలయం ప్రారంభం సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మండల ధర్మ ప్రచారక్ నాగరాజు, ప్రచారక్ రమేష్, పలువురు వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.